సాక్షి కర్నూలు

శుక్రవారం : 19 : మే : 2023



శ్రీ మఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం గురువారం భక్తులతో కిక్కిరిసింది. మూలబృందావనానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని వివిధ రథాలపై ఊరేగించారు.



బోటు ప్రయాణం నిషేధం

కొత్తపల్లి: కృష్ణానదిలో బోటు ప్రయాణాన్ని అధికారులు నిషేధించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బోటు నిర్వాహకులను హెచ్చరించారు.



జేసీబీ విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు రూ.35 లక్షలు విలువ చేసే జేసీబీని విరాళంగా సమర్పించారు. ఈ వాహనానికి గురువారం పూజలు చేశారు.

న్యూస్‌రీల్

రానున్న సార్వత్రిక ఎన్నికలకు ప్రణాళికలు సిద్ధం చేసుకోండి

- కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్‌మీనా

కర్నూలు(సెంట్రల్): 2024లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేసుకుమార్‌మీనా అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, జేసీలతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషనర్ నిబంధనల ప్రకారం ఓటర్ల అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం చేసునకున్న దరఖాస్తులను క్లియర్ చేయాలన్నారు. మే 31వ తేదీ నాటికీ సప్లిమెంటరీ ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఈఆర్‌ఓ నెట్ 2.0పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కలెక్టరేట్ నుంచి డీఆర్వో నాగేశ్వరరావు, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, రమ, ఎన్నికల కార్యాలయ సూపరింటెండ్ మురళి పాల్గొన్నారు.

మండల కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు



గోదాములో ఉన్న పాఠ్యపుస్తకాలు

కర్నూలు సిటీ: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు చేరాయి. ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో కర్నూలు జిల్లాలో 1,464, నంద్యాల జిల్లాలో 1,369 పాఠశాలలకు ఉన్నాయి. వీటిలో చదువుతున్న విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల టైటిల్స్ కలిపి 57.72 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం. మొదటి సెమిస్టర్‌కు సంబంధించి 23.26 లక్షల పాఠ్యపుస్తకాలకుగాను మొదటి విడత 15.22 లక్షలు వచ్చాయి. వీటిని కర్నూలు నుంచి మండల కేంద్రాలకు చేర్చారు. మొదటి సెమిస్టర్ రెండో విడత 8.03 లక్షల పుస్తకాలు రాగా.. శుక్రవారం నుంచి వీటిని అన్ని మండలాలకు పంపనున్నారు.

నేడు అధునాతన చేనేత యంత్ర పరికరాల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఎమ్మిగనూరులో శుక్రవారం చేనేతకార్మికులకు అధునాత యంత్ర పరికరాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ గురవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మిగనూరు చేనేత క్లస్టర్ అభివృద్ధి పథకాన్ని రూ.135.44 లక్షలతో అమలు చేస్తున్నామని, ఇది మూడేళ్ల కాల పరిమితితో పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ పథకం కింద 250 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరుతోందన్నారు. మొదటి విడతలో రూ.44.58 లక్షలతో 134 మందికి అధునాతన యంత్ర పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సృజన, కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట కేశవరెడ్డి తదితరులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

నేడు వ్యవసాయాధికారుల బృందం రాక

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ వినయ్‌చంద్ ఆధ్వర్యంలో 10 మంది వ్యవసాయాధికారుల బృందం శుక్రవారం కర్నూలుకు రానుంది. స్థానిక ఉద్యాన భవన్‌లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నాణ్యతపై కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యవసాయ యంత్రాంగానికి బృంద సభ్యులు శిక్షణ ఇవ్వనున్నారు. బృందంలో కమిషనరేట్ జేడీఏ కృపాదాస్, డీడీఏలు వెంకటేశ్వరరావు, సునీతతో పాటు ఏడీఏ, ఏవోలు ఉన్నారు.

అంతరాయానికి ముందస్తు కట్టడి

- బ్రేక్‌డౌన్స్, ట్రిప్పింగ్స్ సమస్యలకు నిర్వహణతో అడ్డుకట్ట
- ప్రతి నెలా రెండో శనివారం ముందస్తు పనులు
- సబ్ స్టేషన్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణ
- తీగలపై కొమ్మలు ఉంటే తొలగింపు
- గాలి, వర్షాలతో సమస్యలు రాకుండా చర్యలు
- సత్ఫలితాలు ఇస్తున్న విద్యుత్ అధికారుల ప్రత్యేక ప్రణాళిక



సబ్‌స్టేషన్ స్తంభాలపై నిర్వహణ పనులు చేపడుతున్న ఉద్యోగులు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయాలను నివారించేందుకు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. 'ముందస్తు' ప్రణాళికతో చేస్తున్న నిర్వహణ పనులు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు వేసుకొని ముందుకు వెళ్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి నెలా రెండో శనివారాన్ని ఎంపిక చేసి నిర్వహణ పనులు చేపడుతున్నారు. గతంలో కేవలం కర్నూలు నగరానికే పరిమితమైన ఈ పనులు గత ఆరు నెలల నుంచి కర్నూలు, నంద్యాల జిల్లాల్లోనూ నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా సబ్‌స్టేషన్ల మొదలు స్తంభాల వరకు అన్నింటి పైనా దృష్టి సారించి పనులు చేస్తున్నారు. ఈ కారణంగా అకాలంగా ఏర్పడే సమస్యలకు చెక్ పడుతోంది.

ఇవీ సమస్యలు

విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లలో పలు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, వైర్ల లైనుపై ఏర్పాటు చేసిన ఏబీ స్విచ్‌లు, జంపర్లు, ఎగ్జి ఫ్యూజ్‌లు తరచూ అరిగిపోతుంటాయి. గాలులు, వర్షాలు వల్ల ఒక తీగకు మరొకటి తాకడం, చెట్ల కొమ్మలు విరిగి వాటిపై పడడం వంటి కారణాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతూ ఉంటోంది.

నిర్వహణ ఎందుకంటే?

విద్యుత్ పోతే సమస్య ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు చాలా సమయం పట్టొచ్చు. సమస్య ఉన్న చోటు గుర్తిస్తే పని సులువుగా పూర్తి చేయగలరు. కానీ ఎక్కడ ఉందన్నది గుర్తించాలంటే కొన్ని సార్లు అన్ని లైన్లు తిరగాల్సిన పరిస్థితి. దీని కోసం చాలా సమయం వృథా అవుతుంది. ఈ సమస్యను నివారించేందుకు నెలలో ఐదారు గంటలు ఎల్‌సీ (లైన్ క్లియర్) పేరుతో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఆఫ్ చేసిన సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు వీధులు, పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, తొలిదశలోనే సాంకేతిక సమస్యను గుర్తిసారు. విద్యుత్ లైన్లపై తిరుగుతూ ఎక్కడైనా



పవర్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనులు చేస్తున్న దృశ్యం

ఫ్యూజులు, జంపర్లు, ఏబీ స్విచ్‌లు, ఎగ్జిఫ్యూజ్‌లు కాలిపోయే దశలో ఉంటే.. వాటిని తొలిగించి కొత్తవి వేస్తారు. ట్రాన్స్‌ఫార్మర్లు లీకేజీ, ఆయిల్ తక్కువగా ఉండడం వంటి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తారు. తీగలను తాకే, గాలి వస్తే తెగి పడే కొమ్మలను గుర్తించి వాటిని తొలగిస్తారు. ఇలాంటి ముందస్తు పనుల వల్ల అకాలంగా ఏర్పడే విద్యుత్ సమస్యలను 80శాతం వరకు నివారించవచ్చని అధికారులు చెబుతున్నారు.



తీగలను తాకుతున్న చెట్టు కొమ్మను తొలగిస్తున్న దృశ్యం

ప్రతి నెలా రెండో శనివారం రోజున పనులు

సాధారణంగా పని దినాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేసి నిర్వహణ చేయాలంటే ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్యోగులతో పాటు వాణిజ్య, వ్యాపారస్తులకు ఇబ్బందికరంగా ఉంటుంది. ఆదివారాల్లో అత్యధిక శాతం మంది ఇళ్ల వద్ద పిల్లలు, కుటుంబ సభ్యులతో ఉంటారు. అందుకే రెండో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ముందుగానే పత్రికా ప్రకటనల ద్వారా సమాచారం ఇచ్చి పనులు చేపడుతారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా పనులు చేస్తున్నారు. గతంలో నిర్వహణ కేవలం కర్నూలు నగరానికే పరిమితం కాగా గత ఆరు నెలలుగా జిల్లా వ్యాప్తంగా చేపడుతున్నారు.

సమస్యలు తగ్గుముఖం



ముందస్తు నిర్వహణ పనులకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నాం. నెలలో ఒక రోజైనా మెయింటెనెన్స్ చేయాలి. అన్ని సబ్‌స్టేషన్లు ఆఫ్ చేసి లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఏఈలు, ఏడీఈతో పాటు ఈఈలు కూడా లైన్‌లో తిరుగుతారు. సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కండీషన్‌ను పరిశీలించి వాటిని సరిచేస్తారు. దీంతో అనుకోకుండా జరిగే అంతరాయ సమస్యలు బాగా తగ్గుతాయి. ఇది వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు ఈ పనులు ఉపయోగపడుతాయి.

– ఎం. ఉమాపతి, ఆపరేషన్స్ ఎస్ఈ, విద్యుత్ శాఖ

చిరుధాన్యాలతో ఆరోగ్యభాగ్యం

- మిల్లెట్ ఎగ్జిబిషన్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మిల్లెట్ స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ ఎస్.మౌర్య

కర్నూలు(సెంట్రల్): చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్య భాగ్యం లభిస్తుందని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డ్వాక్రా బజార్ ముఖద్వారం వద్ద మిల్లెట్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఒకప్పుడు చిరుధాన్యాలే ఆహారంగా ఉండేవన్నారు. రైతులు వాణిజ్య పంటలను ఎక్కువగా పండించడంతో వీటి జాడ కరువైందన్నారు. ఈ క్రమంలో ప్రజల ఆరోగ్యం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించారన్నారు. అందులో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరాన్ని చిరుధాన్యాల సాగు సంవత్సరంగా ప్రకటించారన్నారు. మిల్లెట్ ఎగ్జిబిషన్‌లో ఏ ధాన్యంతో ఏ వంటకం చేసుకోవచ్చో తయారు చేసి ప్రదర్శనగా ఉంచడం అభినందనీయమన్నారు. మిల్లెట్ ఉత్పత్తులతో తయారు చేసిన వంటకాలను పొదుపు మహిళలతో విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఎం.వెంకటసుబ్బయ్యను కలెక్టర్ ఆదేశించారు. అంతకముందు పొదుపు మహిళలు ఏర్పాటు చేసిన మిల్లెట్ స్టాళ్లను కలెక్టర్, జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ తిలకించి రుచి చూశారు.

నేటి నుంచి వలంటీర్లకు 'వందనం'

విజయవాడలో ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్

- లాంఛనంగా కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహణ
- కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా ప్రతినిధులందరికీ ఆహ్వానాలు
- జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి



జి.నాసరరెడ్డి, జెడ్పీ సీఈఓ

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరవేయడంలో విశిష్ట సేవలు అందిస్తున్న గ్రామ/వార్డు వలంటీర్లను సన్మానించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. 'వలంటీర్లకు వందనం' పేరుతో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న(నేడు) ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారని చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసే ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లాలోని ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు పంపించామన్నారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సునయన ఆడిటోరియంలో కర్నూలు నగర పాలక సంస్థ, సమీప గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్ల సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడురు మున్సిపాలిటీలతో పాటు 25 మండలాల్లో మొత్తం 9,161 మంది గ్రామ/వార్డు వలంటీర్లు సేవలు అందిస్తున్నారని.. వీరిలో అత్యుత్తమ సేవలు అందించిన 38 మంది సేవా వజ్ర అవార్డుకు ఎంపిక కాగా, 160 మందికి సేవా రత్న, 8,963 మంది సేవా మిత్రలుగా ఎంపికయ్యారన్నారు. సేవా వజ్రకు రూ.30 వేలు, సేవా రత్నకు రూ.20 వేలు, సేవా మిత్రకు రూ.10 వేల నగదు ప్రోత్సాహకంగా ప్రభుత్వం అందిస్తోందని సీఈఓ తెలిపారు. అలాగే వీందరికీ ప్రశంసా పత్రం, శాలువా, బ్యాడ్జీ, మెడల్స్‌ను అందించనున్నట్లు చెప్పారు. స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రోజుకు రెండు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని వలంటీర్లను సన్మానించాలని, ఈ కార్యక్రమాన్ని నెల రోజుల్లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

హాస్టళ్లలో అత్యవసర పనులకు నివేదికలు పంపండి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అత్యవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు వీలుగా నివేదికలను వెంటనే పంపించాలని జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి ఎస్‌పీఎస్ ఎన్ రెడ్డి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన వివిధ సంక్షేమ శాఖలకు సంబంధించిన సమీక్షలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో మొత్తం 38 వసతి గృహాలు ఉండగా, వాటిలో 35 సొంత భవనాల్లో ఉనాయన్నారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో మొత్తం 47కుగాను 30 సొంత భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న వసతి గృహాల్లో చేపట్టాల్సిన పనుల వివరాలను వెంటనే తమ కార్యాలయానికి పంపించాలని ఆయన సహాయ సంక్షేమాధికారులను ఆదేశించారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎస్పీ, ఎమ్మెల్యేలు



డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్, ఎమ్మిగనూరు, మంత్రాలయం ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, వై. బాలనాగిరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని ఎస్పీ జి. కృష్ణకాంత్ అన్నారు. గురువారం ఎమ్మిగనూరులో నూతన డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీతో కలసి ఎమ్మిగనూరు, మంత్రాలయం ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, వై. బాలనాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పరిపాలనా సౌలభ్యం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల, సబ్–డివిజన్ల విభజన చేశారన్నారు. అందులో భాగంగానే ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌నై.. డీఎస్పీ పోస్టు వచ్చిందని చెప్పారు. డివిజన్ లెవల్ ఎస్డీపో ఉండటంతో కేసుల దర్యాప్తు వేగవంతం అవుతుందన్నారు. డీఎస్పీ స్థాయి అధికారి ఇక్కడ ఉండడం వల్ల సీఐలు, ఎస్ఐలు అప్రమత్తంగా పనిచేస్తారన్నారు. ప్రజలు ఏమైనా సమస్యలుంటే డీఎస్పీకి ఫిర్యాదు చేసుకోవచ్చునని తెలిపారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేసి ఒక ఎస్ఐని కేటాయించినట్లు చెప్పారు. విధి నిర్వహణలో పోలీసులు అలసత్వంగా ఉండొద్దని సూచించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయ అవరణలో ఎస్పీతోపాటు ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, బాలనాగిరెడ్డి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డి. ప్రసాద్, డీఎస్పీ బి. సీతారామయ్య, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోసిగి సీఐలు మధుసూదన్‌రావు, శ్రీనివాసులు, ఎరిషావలి, ఎస్ఐలు మస్తాన్‌వలి, రమేష్, శ్రీనివాసులు, కిషోర్, నవీన్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, వైఎస్ ఆర్‌సీపీ నేత జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైఎస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, టౌన్ బ్యాంక్ చైర్మన్ రాజశేఖర్, బీఆర్ బసిరెడ్డి, తహసీల్దార్ జయన్న, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎల్ఎల్‌సీ డీఈ లక్ష్మణ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల పదోన్నతులకు రంగం సిద్ధం

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,461 మందికి అవకాశం
- ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా విడుదల
- అభ్యంతరాలకు నేటి వరకు గడువు

సబ్జెక్టు	పదోన్నతుల ద్వారా భర్తీ కానున్న పోస్టులు
గణితం	349
ఫిజికల్ సైన్స్	160
బయోలాజికల్ సైన్స్	225
సోషల్ స్టడీస్	254
ఇంగ్లిషు	349

కర్నూలు(సిటీ): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉపాధ్యాయుల పదోన్నతులపై విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. పాఠశాలల పునఃప్రారంభం నాటికి ప్రక్రియ పూర్తి చేసేలా డీఈఓ కార్యాలయ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,337 మంది ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా, 124 మంది స్కూల్ అసిస్టెంట్లు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందనున్నారు. హైస్కూల్ ప్లస్ టూ స్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ స్కూల్స్ నంద్యాల జిల్లాలో మూడు ఉన్నాయి. ఒక్కో స్కూల్‌లో కనీసం ఏడుగురు పీజీటీలు పని చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ స్కూళ్లలో గతేడాది ఎలాంటి ఎంట్రోల్‌మెంట్ లేదు. ఇలాంటి సమయంలో పీజీటీ పోస్టుల భర్తీ ఉంటుందా? ఉండదా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. రేషనలైజేషన్‌లో భాగంగా ఈ ఏడాది జనవరిలో కొంత మంది ఉపాధ్యాయులను హైస్కూళ్లకు సర్దుబాటు చేశారు. తాజాగా చేపట్టబోయే పదోన్నతుల్లో వీరిని కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. 2023–24 విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో పూర్తిస్థాయిలో ఖాళీలను భర్తీ చేయనున్నారు. పదోన్నతుల ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా కర్నూలు డీఈఓ వ్యవహరించనున్నారు.

- హైస్కూల్ ప్లస్ స్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్లకు పీజీటీలుగా అవకాశం కల్పించేందుకు ఇప్పటికే సీనియారిటీ జాబితా ప్రకటించారు.
- ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్, స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్–2 హెచ్‌ఎం పదోన్నతులు ఇచ్చేందుకు సీనియారిటీ జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ జాబితాపై అభ్యంతరాలను శుక్రవారం లోపు తెలిపేందుకు అవకాశం ఇచ్చారు.
- తుది సీనియారిటీ జాబితాలు రేపు(శనివారం) ప్రకటించనున్నారు. 21, 22 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు విల్లింగ్, నాట్ విల్లింగ్‌లు తీసుకుంటారు.





చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న చిన్నారులు, బహుమతులు అందుకున్న విజేతలతో ఎమ్మెల్యే సుధాకర్, సాక్షి బ్రాంచ్‌మేనేజర్ సతీష్‌రావు తదితరులు

భళారే 'చిత్రం'

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కర్నూలు నగరంలోని ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలకు విశేష స్పందన లభించింది. పర్యావరణ –పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలన అనే అంశంపై విద్యార్థులు విభిన్న చిత్రాలను గీసి అభినందనలు అందుకున్నారు.

- వివరాలు II లో

నిప్పుల వర్షం



కర్నూలు నగరంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన వీధి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రచండ భానుడి ధాటికి వాతావరణం నిప్పుల వర్షాన్ని తలపిస్తోంది. ఉదయం 9 గంటలకు మొదలవుతున్న ఎండలు, వడగాలుల తీవ్రత సాయంత్రం 7 గంటలు దాటినా కనిపిస్తోంది. గురువారం ఉష్ణోగ్రతలు మరింత పెరగడం గమనార్హం. ఉమ్మడి కర్నూలు జిల్లా నిప్పుల కుంపటిని తలపించింది. గంట, గంటకు సూర్య ప్రతాపం పెరుగుతోంది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కౌతాళం మండలం తోవి గ్రామంలో 43 డిగ్రీలు, 2 గంటల ప్రాంతంలో కోడుమూరులో 43.34 డిగ్రీలు, 4గంటల ప్రాంతంలో మంత్రాలయంలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. నంద్యాల జిల్లాలో 12 గంటల సమయంలో బండిఆత్మకూరులో 43.78, ఒంటి గంట ప్రాంతంలో 44.. 2 గంటల ప్రాంతంలో బనగానపల్లె మండలం పసుపలలో 43.87.. 3 గంటల ప్రాంతంలో 44.48.. 4 గంటల ప్రాంతంలో పాణ్యం మండలం గోనవరంలో 44.86 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలు ఏకంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. రాత్రి ఉష్ణోగ్రత కూడా 28.2 డిగ్రీలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. మరో 2–3 రోజులు అధిక ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

భళారే 'చిత్రం'

- సాక్షి ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు
- జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పలువురు ప్రతిభ
- సమయం విలువైనది.. సెల్‌ఫోన్‌తో వృథా చేయొద్దు
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్


మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్


చిత్రలేఖనం పోటీలకు హాజరైన విద్యార్థులు, చిత్రంలో వారి తల్లిదండ్రులు

కర్నూలు(టౌన్): ప్రతి విద్యార్థిలో సృజనాత్మకత ఉంటుంది. దానిని వెలికి తీసి ప్రోత్సహిస్తే వారు బంగారు భవిష్యత్తును నిర్మించుకుంటారు. ఈ ఉద్దేశంతోనే 'సాక్షి' వేసవి సెలవుల్లో విద్యార్థినీ విద్యార్థులకు మెదడుకు పదును పెట్టే అంశాల్లో పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గురువారం కర్నూలు నగరంలోని ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించింది. పర్యావరణ –పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలన అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై చక్కని చిత్రాలు గీసి అభినందనలు అందుకున్నారు.

సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయొద్దు

సెల్‌ఫోన్‌కు పరిమితం కాకుండా వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులతో సమయాన్ని వెచ్చించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలకు ఎమ్మెల్యే సుధాకర్ స్పాన్సర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు ఎంతో భవిష్యత్తు ఉందని, సమయాన్ని వృథా చేసుకోకుండా ప్రణాళికతో ముందుకుపోవాలన్నారు. సెల్‌ఫోన్లు ఎక్కువగా చూడటం ద్వారా మెంటల్ స్టెబిలిటీ కోల్పోతారన్నారు. తద్వారా జీవితం ప్రమాదకరంగా మారుతుందన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించి పిల్లలను సెల్ ఫోన్‌కు దూరంగా ఉంచాలన్నారు. సాక్షి బ్రాంచ్ మేనేజర్ సతీష్‌రావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ భూతంతో ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్‌ను నిర్మూలించాయన్నారు. స్వచ్ఛ భారత్ నిర్మాణంలో అందరం భాగస్వాములు కావాలన్నారు. అంతకు ముందు 6,7 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులను జూనియర్స్ విభాగం, 8,9,10 తరగతుల విద్యార్థులను సీనియర్స్ విభాగం కింద పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన విజేతలను న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన డ్రాయింగ్ మాస్టర్లు ఖాజ, రామక్రిష్ణ ప్రకటించారు. ఒక్కో విభాగం నుంచి ఐదుగురు చొప్పున జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో మొత్తం పదిమంది విజేతలకు కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ షీల్డ్‌లు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జి రవి వర్మ, ఎడిషన్ ఇన్‌చార్జి శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

జూనియర్స్ విభాగంలో...

- 6 వ తరగతిలో బి. ఇంద్ర నీలాధర్ (మొదటిస్థానం, శ్రీ చైతన్య స్కూల్) ఎం.ముజమిల్ (రెండో స్థానం, సెయింట్ జోసఫ్ ఇంగ్లిష మీడియం స్కూల్), 7 వ తరగతిలో బి. శ్రీనివాస్ (మొదటి స్థానం, ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాల) యశ్మిత రాధ (రెండవ స్థానం, మాంటిస్సోరి ఉన్నత పాఠశాల)

సీనియర్స్ విభాగంలో...

- 8 వ తరగతిలో బి. జశ్వంత్ (తొలి స్థానం, ఎడిఫై స్కూల్) ఎం. కావ్య (రెండో స్థానం, జీఎంజే స్కూల్), 9వ తరగతి లో సి. రోహిణి (మొదటి స్థానం, మాంటిస్సోరి స్కూల్)ఎస్. ఆశీర్వాద్ (రెండవ స్థానం, శ్రీ నవనంది స్కూల్), 10వ తరగతిలో ఎస్. అక్షితరాజ్ (మొదటి స్థానం, మాంటిస్సోరి పాఠశాల) కె. హృదయ బృందన (రెండో స్థానం, ఎవరెస్టు ఇంగ్లిష స్కూల్)




పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలన అంశంపై చిత్రాలు గీస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

అప్పుల బాధ తాళలేక..

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో ఓ వ్యక్తి అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చాకలి నారాయణ కొడుకు లక్ష్మయ్యకు 9 ఎకరాల పొలం ఉంది. పంటల సాగుకు, బోర్లు వేయించడానికి తెచ్చిన అప్పులు సుమారు 10 లక్షల దాకా ఉన్నాయి. వాటిని ఎలా తీర్చాలనే బెంగతో సతమతమయ్యేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం పంట పొలానికి వెళ్లి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త ఇంటికి రాకపోవడంతో భార్య కస్తూరి, కుటుంబ సభ్యులు పొలం దగ్గరకు వెళ్లి చూడగా లక్ష్మయ్య(25) చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు. భార్య కస్తూరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


మృతుడు తలారి జయరాముడు

బనగానపల్లె రూరల్: మండలంలోని బీరవోలు గ్రామ సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రామాంజనేయరెడ్డి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రామతీర్థం గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా తలారి జయరాముడు లోడింగ్ కార్మికుడుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరు గురువారం ఉదయం పలుకూరు గ్రామం నుంచి ట్రాక్టర్‌లో నాపరాయిలోడ్ వేసుకుని నంద్యాలకు బయలుదేరారు. బీరవోలు– నందివర్గం క్రాస్ రోడ్డు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాలీపై కూర్చున జయరాముడు మీద నాపరాళ్లుపడటంతో అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్ వెంకటసుబ్బయ్య తీవ్రగాయాల పాలయ్యాడు. చికిత్స కోసం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడి వైద్యులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. జయరాముడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె వైద్యశాలకు తరలించి మృతుడి భార్య కృష్ణ వేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

ఆర్‌యూలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరం (2023-24) నుంచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు ప్రారంభంకానున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులో 60 సీట్లకు అనుమతి లభించిందన్నారు. దీంతో పాటు కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రస్తుతమున్న 60 సీట్లను 120 సీట్లకు పెంచుకోవడానికి అఖిల భారత సాంకేతిక విద్యామండలి అనుమతించిందని చెప్పారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుకు మంచి డిమాండ్ ఉందని, ఉపాధి అవకాశాలు కూడా అధికమని చెప్పారు. ఇప్పటివరకు కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లోనే అందుబాటులో ఉన్న ఇలాంటి కోర్సులను రాయలసీమ విశ్వవిద్యాలయంలో ప్రారంభించడంతో విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	4,667	7,829
ఆముదం	5,049	5,309
వాము	5,569	26,555
ఎండు మిర్చి	5,000	17,209
కందులు	7,406	8,826
మొక్కజొన్న	1,325	1,832
మినుములు	7,396	7,396

రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కర్నూలు: కర్నూలు రైల్వే స్టేషన్ నుంచి అలంపూరు వైపు వెళ్లే మార్గంలో పంచలింగాల రైల్వే బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం పడి ఉంది. బుధవారం రాత్రి స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. గురువారం ఉదయం వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉండి లైట్ బ్లూ టీషర్టు, ఆకుపచ్చ కట్ డ్రాయర్ ధరించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. ప్రమాదవశాత్తు మరణించాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9441759875కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

బోటు ప్రమాదం కేసులో నిందితుల అరెస్టు


నిందితులను అరెస్టు చూపిస్తున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

బనగానపల్లె: అవుకు మండలంలోని రిజర్వాయర్ వద్ద ఈ నెల 14న జరిగిన బోటు ప్రమాదం కేసులో బోటు డ్రైవర్ గేదేల శ్రీనివాసరావు, బోటు యజమాని దబ్బర శ్రీనివాసనాయుడును పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి బనగానపల్లె సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించారు. 2018వ సంవత్సరంలో అవుకు రిజర్వాయర్ వద్ద టూరిజం రెస్టారెంట్, బోటింగ్‌ను డి. శ్రీనివాసనాయుడు ఏపీ టూరిజంశాఖ నుంచి ఐదేళ్లు లీజు పొందారు. నాలుగు రకాల బోటులను ఏర్పాటు చేసి వాటిని నడిపేందుకు గంగరాజు, జి. శ్రీనివాసరావు అనే డ్రైవర్లను నియమించారు. రిజర్వాయర్‌లో పడవ నడిపే సమయంలో డ్రైవర్‌తో పాటు ఒక హెల్పర్ ఉండాలి. అలాగే పడవలో ప్రయాణించేవారికి లైఫ్ జాకెట్లు ఇవ్వాలి. ఈ నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా బోటు యజమాని అక్కడ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఈ నెల 14 కోవెలకుంట్ల ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ దూదేకుల రసూల్‌బాషా కుటుంబసభ్యులు విహారయాత్రకెళ్లారు. రిజర్వాయర్ చూసేందుకు మొత్తం 14 మంది బోటు ఎక్కారు. డ్రైవర్ శ్రీనివాసరావు బోటును నిర్లక్ష్యంగా నడపడంతో బోటు మునిగి సాజిదా, ఆసియా, నూర్జహాన్ అనే ముగ్గురు మహిళలు మృతి చెందారు. ఈ ఘటనపై నమోదైన కేసులో గురువారం ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ సీఐ ప్రీతంరెడ్డి, అవుకు ఎస్ఐ జగదీశ్వరరెడ్డి, బనగానపల్లె, నందివర్గం ఎస్ఐలు రామిరెడ్డి, వీరాంజనేయులు, రామాంజనేయరెడ్డి ఉన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సీఎస్ ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జి.సృజన, జేసీ మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు(సెంట్రల్): జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేసి నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రీసర్వే, హౌసింగ్, వ్యవసాయం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయిన తరువాత వాటికి విద్యుత్, నీటి సదుపాయం కల్పించాలన్నారు. హౌసింగ్ డే రోజున కలెక్టర్లు లేవుట్లలో పర్యటించి స్టేజ్ కన్వర్షన్‌పై దృష్టి సారించాలన్నారు. పీఎంఈవై గ్రామీణ పథకంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. రీసర్వేకు సంబంధించి మొదటి దశలో పూర్తయిన భూములకు సరిహద్దురాళ్లు నాటే కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూ హక్కు పత్రాలను రైతులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. మ్యూటేషన్ ట్రాన్షక్షన్, కరెక్షన్‌లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని చెప్పారు. జాతీయరహదారుల నిర్మాణానికి భూసేకరణ పనులు ముమ్మరం చేయాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి వైఎస్ఆర్ యంత్రసేవ పథకం ద్వారా సబ్సిడీపై అర్హులైన రైతులకు ఈనెల 25వ తేదీలోపు యంత్రాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో వర్గీకరణ ఉద్యమం


మహా సభను ఉద్దేశించి మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

డోన్ టౌన్: ఎస్సీ వర్గీకరణ ఉద్యమం జాతీయ స్థాయిలో ప్రకంపణలు సృష్టిస్తోందని, త్వరలో వాటి ఫలాలు మన పిల్లలకు అందుతాయని ఎమ్మార్పీఎస్(దండోర) వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదురుగా గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల ఉమ్మడి కర్నూలు జిల్లా మహా సభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1996లో మొదలై 29 సంవత్సరాలుగా కొనసాగుతుందంటే అది ఒక్క ఎమ్మార్పీఎస్ ఉద్యమమే అన్నారు. ఏప్రిల్ 17, 18 తేదిల్లో జరిగిన జాతీయ మహా సభల తీర్మానం ప్రకారం 50 రోజులు గ్రామాల బాట ద్వారా కమిటీలు ఏర్పాటు చేసి గ్రామ స్థాయి నుంచి ఉద్యమ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. వర్గీకరణ సాధనకు పోరాటాలతో పాటు పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఆమోదం కోసం చట్ట సభల్లో మాదిగల వాణి వినిపించేందుకు మాదిగలకు రాజ్యాధికారం కావాలని, అందుకోసమే మహాజన సోషలిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. యువతను భాగస్వాములను చేస్తూ, కమిటీలను ఏర్పాటు చేసి 25లక్షల కమిటీలతో వర్గీకరణ యుద్ధానికి సైన్యం సిద్ధం చేయాలన్నారు. ఈ మహా యుద్ధంలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి, మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ గుండాల ఈశ్వరయ్య మాదిగ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిక్షాలు, జాతీయ నాయకులు బుచ్చన్న, నరసింహులు, ఎంఎస్పీ కర్నూలు కన్వీనర్ సుబాష్‌చంద్ర, ఎద్దుపెంట కేశవయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి దుర్మరణం


మృతి చెందిన కేశవ్

మహానంది: నంద్యాల పట్టణంలో హమాలీ పనులు చేసుకునే ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శిరివెళ్ల మండలం శ్రీరంగాపురం గ్రామానికి చెందిన మార్కాపురం, లక్ష్మీ చెన్నమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో మొదటి కుమారుడైన జిల్లెల్ల కేశాలు ఆలియాస్ శివకేశవ్ (24) హమాలీ పనులు చేస్తున్నాడు. తన మిత్రుడు, గాజులపల్లెకు చెందిన నరేంద్రతో కలిసి బుధవారం రాత్రి బైక్‌పై ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో కేశవ్ తలకు తీవ్ర గాయాలై చెవిలో నుంచి రక్తస్రావం వచ్చిందని స్థానికులు తెలిపారు. వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే, కోలుకోలేక కేశవ్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నరేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.నాగేంద్రప్రసాద్ తెలిపారు. కుటుంబానికి అండగా నిలిచే కుమారుడి మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగారు.

'రెమిడియల్'పై నిర్లక్ష్యం

- తూతూ మంత్రంగా రెమిడియల్ క్లాసుల నిర్వహణ
- ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- ఇలాగైతే సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత పెరగడం సాధ్యమేనా?


జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం

కర్నూలు సిటీ: పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమిడియల్ క్లాసులు నిర్వహించి, పాస్ అయ్యేవిధంగా తర్ఫీదు ఇవ్వాలని ఉన్నతాధికారులు చేసిన ఆదేశాలు బుట్టదాఖలవుతున్నాయి. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ యాజమాన్యాల వారీగా పదో తరగతి పరీక్షల్లో వచ్చిన ఫలితాలపై ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో పాటు డిప్యూటీ డీఈఓలు, సబ్జెక్టు నిపుణులతో పునఃసమీక్షించాలి. కానీ ఫలితాలు విడుదలై పది రోజులు దాటినా సమీక్ష నిర్వహించలేదు. ఆయా స్కూళ్లలో ఎంత మంది ఫెయిల్ అయ్యారో గుర్తించి, నేరుగా ఆ విద్యార్థి ఇంటికి ఫెయిల్ అయిన సబ్జెక్టు టీచర్, ఆ స్కూల్ హెచ్ఎం వెళ్లి మాట్లాడాల్సి ఉంది. విద్యార్థితో పాటు తల్లిదండ్రులతో మాట్లాడి ఫెయిల్ అయిన సబ్జెక్టుపై ప్రత్యేక తరగతులు నిర్వహించి పాస్ చేయిస్తామని భరోసా ఇవ్వాలి. అయితే ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఇంత వరకు ప్రభుత్వ, జెడ్పీ, ఎయిడెడ్ స్కూళ్లలో ఎంత మంది ఫెయిల్ అయ్యారు? వారికి ఎక్కడెక్కడ తరగతులు నిర్వహించాలో కూడా ఎలాంటి ప్రణాళిక నిరన్వహించలేదు. నంద్యాల జిల్లాలో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తుండగా.. కర్నూలు జిల్లాలో పట్టించుకోవడం లేదు. కేవలం కస్తూర్బా, ఏపీ మోడల్ స్కూళ్లో మాత్రమే ఫెయిల్ అయిన విద్యార్థులను కలిసి వారికి ఉత్తీర్ణతపై భరోసానిచ్చి ప్రత్యేక తరగతులను నిర్వహించే ప్రక్రియను మొదలు పెట్టారు.

జెడ్పీ స్కూళ్లలో పర్యవేక్షణ కరువు

జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన ఉన్నత పాఠశాలల విద్యార్థులు 28,786 మంది పదోతరగతి పరీక్షలకు హాజరు అయ్యారు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో వీరిలో 17,439 మంది ఉత్తీర్ణులు అయ్యారు. మిగిలిన 11,347 మందిలో ఎక్కువగా గణితం, సోషల్, సైన్స్, తెలుగులో ఫెయిల్ అయ్యారు. ప్రతి ఏటా ఫలితాలు వచ్చిన నాలుగైదు రోజుల్లో సమీక్ష నిర్వహిస్తారు. ఫలితాలు ఎందుకు తగ్గాయో తెలుసుకుంటారు. కానీ ఈ ఏడాది మాత్రం సమీక్షించేందుకు సమయం లేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఫెయిల్ అయిన వారిలో ప్రభుత్వ హైస్కూళ్లలో 904, జెడ్పీ స్కూళ్లలో 7,040, మున్సిపల్స్‌లో 997, ఎయిడెడ్‌లో 141, కేజీబీవీల్లో 438, ఏపీ మోడల్ స్కూళ్లలో 428 మంది విద్యార్థులు ఉన్నాయి. ప్రస్తుతం ఆదోని(జనరల్), ఆస్పరి, గూడూరు, కోడుమూరు, కల్లూరు, కోసిగిలోని కేజీబీవీల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఏపీ మోడల్ స్కూళ్లలో ఈ నెల 10వ తేదీ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జెడ్పీ స్కూళ్లలో చాలా తక్కువ చోట్ల తరగతులు నిర్వహిస్తున్నా కూడా పర్యవేక్షించే వారు లేదు. దీంతో విద్యార్థుల హాజరు 10 శాతం కూడా లేదని విద్యాశాఖ వర్గాలే చెబుతున్నాయి.